క్లుప్తంగా

యోగాకు ప్రాధాన్యం ఇవ్వాలి



కార్యక్రమంలో పాల్గొన్న సహజ యోగా రాష్ట్ర కన్వీనర్ పద్మావతి తదితరులు

మలికిపురం: విద్యార్థులు యోగాకు ప్రాధాన్యం ఇవ్వాలని సహజ యోగా రాష్ట్ర కన్వీనర్ పద్మావతి సూచించారు. లక్కవరంలోని ఒక విద్యా సంస్థ ఆధ్వర్యంలో జరిగిన నియోఫైట్ డే కార్యక్రమంలో ఆమె పాల్గొని ప్రసంగించారు. యోగా విద్యార్థుల్లో ఏకాగ్రతతో పాటు ఉత్తమ లక్షణాలను పెంచుతుందని అన్నారు. ప్రతి ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థ కూడా విద్యార్థుల్లో ఏకాగ్రత పెంచేందుకు ఇటువంటి యోగా కార్యక్రమాలను నేర్పించాలని సూచించారు. కళాశాలల్లో ఐఐటీ తరగతులను కూడా ఆమె ప్రారంభించారు. కరస్పాండెంట్ మంగెన వెంకట సత్యప్రసాద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రిటైర్డ్ ఎంఈఓ జేఎస్ఎస్ గోపాలకృష్ణ, ఏబీ నాయుడు, అధ్యాపకులు నాగ నూకరాజు, ధన, రాంబాబు, శ్రీనివాస్, దుర్గారావు, జి.ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

రాజోలు: మండలంలో వివిధ గ్రామాల్లో ఖాళీగా ఉన్న 10 వలంటీర్ పోస్టులను భర్తీ చేసేందుకు ఎంపీడీఓ ఎస్.బాలాజీ బుధవారం నోటిఫికేషన్ విడుదల చేశారు. ఈ నెల 24 తేదీ సాయంత్రం 5 గంటల వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆన్‌లైన్ చేసిన కాపీలను సంబంధిత గ్రామ పంచాయతీ కార్యదర్శికి అందజేయాలన్నారు. గ్రామ సచివాలయ రిజర్వేషన్ కేటగిరిలు రాజోలు-1 (ఎస్సీ-మహిళ), రాజోలు-4 (బీసీ-ఏ పురుష), చింతలపల్లి-1(ఓసీ పురుష), చింతలపల్లి-2 (ఎస్సీ పురుష), చింతలపల్లి-2 (బీసీ-బీ మహిళ), కాట్రేనిపాడు-1 (బీసీ-ఏ పురుష), ములికిపల్లి (బీసీ-బీ మహిళ), బి.సావరం (పాలగుమ్మి) (ఎస్సీ మహిళ), శివకోడు1 (ఎస్సీ పురుష), తాటిపాక-1 (బీసీ-ఏ పురుష) కేటాయించారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



ఆలమూరులో వాహనదారులకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్సై శ్రీనునాయక్

ఆలమూరు: రహదారులపై ప్రయాణించేటప్పుడు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు సక్రమంగా పాటించాలని ఆలమూరు ఎస్సై ఎల్.శ్రీనునాయక్ అన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద ప్రత్యేక డ్రైవ్‌ను ఏర్పాటు చేసి వాహనదారుల రికార్డులను తనిఖీ చేశారు. వాహనదారులకు, ప్రయాణికులు రహదారి నిబంధనలపై ఆయన ప్రత్యేక కౌన్సెలింగ్ ఇచ్చారు. 18 యేళ్లు నిండని మైనర్లకు వారి తల్లిదండ్రులు వాహనాలు నడపడాన్ని అనుమతించవద్దన్నారు. వాహనదారులందరూ వాహన భీమా చేయించుకోవాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడిపిన వారిపై చట్టారీత్యా తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండండి

అంబాజీపేట: ఇటీవల కాలంలో సైబర్ నేరగాళ్లు ఫోన్‌లు చేసి వివరాలు తెలుసుకుని మోసం చేస్తున్నారని వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీఓ కె.సత్యనారాయణ బుధవారం ప్రకటనలో తెలిపారు. సైబర్ నేరగాళ్లు ఫోన్లు చేసి ప్రభుత్వ పథకాలు బ్యాంకు ఖాతాల్లో మీకు జమ అయినది లేనిది వెరిఫై చేస్తామని నమ్మించి మోసం చేస్తున్నారన్నారు. అలాంటి ఫోన్ కాల్ వచ్చిన సమయంలో ఆధార్ కార్డు, పాన్ కార్డు నంబర్లు, బ్యాంక్ అకౌంట్ నంబర్లు చెప్పకుండా అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. వారికి సమాచారం ఇస్తే బ్యాంకు ఖాతాలో ఉన్న నగదును అపహరించుకుపోతారన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వ పథకాలకు సంబంధించి ఎవరి వద్ద నుంచి ఏ విధమైన ఫోన్‌లు రావన్నారు.

చిన్నారులకు టీకాలు

ఆలమూరు: చిన్నారులకు నిర్ణీత సమయంలో విధిగా టీకాలు వేయించాలని చొప్పెల్ల, పెదపళ్ల పీహెచ్‌సీ వైద్యాధికారులు పి.భవానీ శంకర్. డి.మల్లిఖార్జున్ అన్నారు. ఆయా పీహెచ్‌సీల పరిధిలోని సబ్ సెంటర్లతో పాటు ఆలమూరు ప్రభుత్వ ఆస్పత్రిలో హెల్త్ సిబ్బంది బుధవారం చిన్నారులకు టీకాలను అందజేశారు. వైద్యాధికారులు ఆధ్వర్యంలో ఎంపీహెచ్ఈఓ కె.జ్యోతికుమార్, సీహెచ్ఓ పి.రాధాకృష్ణ, హెల్త్ ఎడ్యుకేటర్లు ఏవీవీ రాజా, బి.సూర్యనారాయణ, సూపర్‌వైజర్లు ఎం.శ్రీనివాసరావు, పి.శివప్రసాద్, పి.ఉమ, ఆర్ బాలామణి వైద్యసేవలను పర్యవేక్షించారు. పెదపళ్ల, చింతలూరు, పెనికేరు, చొప్పెల్ల, చెముడులంక, మడికి, గుమ్మిలేరు, నర్సిపూడి గ్రామాల్లో చిన్నారులకు టీకాలు, బాలింతలు, గర్భిణులకు ఇంజక్షన్లు అందజేశారు. ధనుర్వాతం, కామెర్లు, క్షయ, పోలియో, డిఫ్తీరియా, కోరింత దగ్గు నివారణకు టీటీ, డీపీటీ, మీజిల్స్, పెంటావాలెంట్, ఎంఆర్, హెపటైటిస్-బీ వ్యాక్సిన్లను అందజేశారు.

శాకంబరీ నమోస్తుతే..

- ఆలయాల్లో ప్రత్యేక కుంకుమ పూజలు
- ఘనంగా గ్రామాల్లో దసరా సంబరాలు



అంబాజీపేటలో శేషవాహనంపై ఊరేగుతున్న శ్యామలంబ అమ్మవారు



పెదపట్నంలో శాకంబరిగా దర్శనమిచ్చిన దుర్గమ్మ

అంబాజీపేట: దేవి శర్నవరాత్రుల్లో భాగంగా మహర్నవమి కావడంతో అంబాజీపేట మండలంలోని అయా గ్రామాల్లో ఉన్న కనకదుర్గమ్మ ఆలయాల వద్ద బుధవారం మహిళలు ఘనంగా కుంకుమ పూజలు నిర్వహించారు. స్థానిక పెద్దవీధిలో వీణా శ్యామలాంబ సమేత చంద్రశేఖర స్వామి ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆది శేష వాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు. బస్టాండ్ వద్ద ఉన్న వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారు లలితా దేవి అలంకరణలో దర్శనమిచ్చారు.

కొత్తపేటలో..

కొత్తపేట: దసరా మహోత్సవాల్లో భాగంగా మండలంలోని దుర్గాదేవి ఆలయాలు, ఉత్సవ పందిళ్లలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వాసవీ కన్యకాపరమేశ్వరీదేవి అమ్మవారిని లలితాదేవిగా అలంకరణ చేశారు. మహిళలతో అమ్మవారి అలంకరణ పూజలు, సహస్ర గాజుల పూజ నిర్వహించారు. ఏనుగులమహల్ రాజరాజేశ్వరిదేవి ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. బొరుసువారిసావరం కనకదుర్గాదేవి అమ్మవారిని అన్నపూర్ణాదేవిగా అలంకరించి దర్శనం కల్పించారు. వాడపాలెం అయ్యప్పస్వామి, జ్ఞానసరస్వతీదేవి ఆలయంలో వివిధ పూజలు, హోమాలు నిర్వహించారు. స్థానిక బోడిపాలెం కనకదుర్గాదేవి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక గ్రామ దేవత బంగారమ్మకి విశేష పూజలు నిర్వహించారు. మండలంలోని వివిధ ఆలయాలు, ఉత్సవ పందిళ్లలో ప్రత్యేక కుంకుమ పూజలు నిర్వహించారు.

శాకంబరిగా దుర్గమ్మ దర్శనం

మామిడికుదురు: కనకదుర్గమ్మ వారి శరన్నవరాత్ర ఉత్సవాలు నాలుగోరోజు బుధవారం మండలంలో వేద మంత్రోచ్చారణలు, భక్తుల కోలాహలం నడుమ అంగరంగ వైభవంగా జరిగాయి. పాశర్లపూడి బాడవలో కొలువుదీరిన కనకదుర్గమ్మ అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయంలో శత చండీయాగం, లక్ష కుంకుమార్చన, లక్ష్మీ గణపతి అభిషేకాలు, మల్లేశ్వరస్వామికి ఏకాదశ రుద్రాభిషేకం, లక్ష బిల్వార్చన పూజలు ఘనంగా జరిపించారు. పెదపట్నం బాబానగర్ ఆలయంలో దుర్గాదేవిని కూరగాయలతో శాకంబరిగా అలంకరించారు. పెదపట్నంలంకలో కొలువుదీరిన కనకదుర్గమ్మ కూష్మాండ అవతారంలో భక్తులకు శోభాయమానంగా దర్శనమిచ్చారు. అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. మండలంలోని పలు ఆలయాల్లో అమ్మవారికి నిర్వహించిన ప్రత్యేక పూజల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పి.గన్నవరంలో..

పి.గన్నవరం: దశరా మహోత్సవాల సందర్భంగా స్థానిక ఏజీ రోడ్డులో వేంచేసిన శ్రీలక్ష్మీ కనకదుర్గమ్మ, తాటికాయలవారిపాలెంలో వేంచేసిన కనకదుర్గమ్మ వారు బుధవారం శ్రీమహాలక్ష్మీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. జి.పెదపూడిలో వేంచేసిన శ్రీవైష్ణవి కనకదుర్గమ్మ వారు శ్రీలలితా త్రిపుర సుందరీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని పూజలు చేశారు. తాటికాయలవారి పాలెంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు పెద్ద ఎత్తున అన్న సమారాధన చేశారు.

ఆత్రేయపురంలో..

ఆత్రేయపురం: దసరా ఉత్సవాల్లో భాగంగా మండలంలోని ఉచ్చిలి గ్రామంలో వేంచేసిన విజయ దుర్గాదేవి అమ్మవారు మహాలక్ష్మీదేవిగా భక్తులకు దర్శమిచ్చారు. అలాగే మండలంలోని దేవీ ఆలయాలు, మండపాల వద్ద దేవీ నవరాత్ర ఉత్సవాలు ఘనంగా జరిగాయి. అలాగే మండలంలోని పలు ఆలయాల్లో అమ్మవార్లను పలు అలంకారాల్లో అలంకరించారు. ఆలయాల వద్ద భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఆలయ కమిటీ నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.



అన్నపూర్ణాదేవిగా కొత్తపేట వాసవీమాత అలంకరణ



తాటికాయలవారిపాలెంలో అన్నపూర్ణాదేవిగా కనకదుర్గమ్మ



ఉచ్చిలిలో మహాలక్ష్మిగా దర్శనమిచ్చిన దుర్గమ్మ

వైభవంగా కుంకుమార్చనలు



చింతలూరులోని నూకాంబిక అమ్మవారి ఆలయ ఆవరణలో కుంకుమ పూజలు నిర్వహిస్తున్న భక్తులు

ఆలమూరు: మండలంలోని చింతలూరులో వేంచేసిన నూకాలమ్మ అమ్మవారి ఆలయ ఆవరణలో సామూహిక కుంకుమార్చనలు జరిగాయి. శరన్నవరాత్ర మహోత్సవాలను పురస్కరించుకుని నూకాలమ్మ అమ్మవారి ఆవరణలో ఆలయ చైర్మన్ నూకపెయ్యి సూరిబాబు, ఈఓ ఉండవల్లి వీర్రాజు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పూజా కార్యక్రమానికి పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి కుంకుమ పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. నూకాలమ్మ అమ్మవారి నామ నక్షత్రమైన అనూరాధ బుధవారం ప్రవేశించడంతో ఆలయ కమిటీ ఈ కుంకుమ పూజలను ఉచితంగా భక్తులకు అందజేసింది. అలాగే మండలంలోని వివిధ గ్రామాల్లో ఏర్పాటు చేసిన దేవి మండపాల్లో అమ్మవారు మహాలక్ష్మి రూపంలో దర్శనమిచ్చారు. ఆయా మండపాల వద్ద ఏర్పాటు చేసిన ఆధ్యాత్మిక, భజన కార్యక్రమాలు భక్తులను అలరించాయి.

సీసీ రోడ్ల ప్రారంభం



సీసీ రోడ్డు ప్రారంభించిన ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు

మలికిపురం: అభివృద్ధి, ప్రజా సంక్షేమ పథకాలను సమానంగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు తీసుకెళ్తుందని రాజోలు ఎమ్మెల్యే రాపాక వర ప్రసాదరావు పేర్కొన్నారు. మండలంలో గొల్లపాలెంలో నిర్మాణం పూర్తయిన సీసీ రోడ్లను బుధవారం ఆయన ప్రారంభించారు. రహదారుల అభివృద్ధికి సీఎం జగన్ ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ మందపాటి నాగేశ్వరరావు, ఎంపీటీసీ మట్ట అనంతలక్ష్మి, మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు అడబాల వీర బ్రహ్మాజీరావు, ఏఎంసీ వైస్ ప్రెసిడెంట్ సుంకర బాబ్జి, నాయకులు గుండుమేను నారాయణమూర్తి, కందుల విజయ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మడికి యువకుడికి డాక్టరేట్



కొత్తపల్లి వీరబ్బాయి

ఆలమూరు: మండలంలోని మడికిలో సాధారణ రైతు కుటుంబానికి చెందిన కొత్తపల్లి వీరబ్బాయి ఆంధ్ర విశ్వ విద్యాలయం నుంచి డాక్టరేట్ సాధించాడు. చెముడులంక ఎస్‌టీఎస్ఎన్ఎస్ జెడ్పీ హైస్కూల్‌లో పదో తరగతి పూర్తి చేసిన ఆయన బీఎస్సీ, బీఈడీ, ఎమ్మెస్సీ సైకాలజీతో పాటు ఎంబీఏ విద్యను అభ్యసించాడు. వీరబ్బాయి ప్రస్తుతం తూర్పుగోదావరి జిల్లా రాజానగరం మండలం పాలచర్లలోని బీవీసీ ఇంజినీరింగ్ కళాశాలలో విభాగాధిపతిగా పనిచేస్తున్నాడు. కామర్స్ మేనేజ్‌మెంట్ విభాగంలో ఉద్యోగుల ఉత్పాదకతపై శిక్షణ, అభివృద్ధి, ప్రభావం అంశాలపై రాజమహేంద్రవరం ఓఎన్‌జీసీ సహకారంతో పరిశోధన చేసినందుకు గాను డాక్టరేట్ వరించినట్లు అవార్డు గ్రహీత వీరబ్బాయి బుధవారం విలేకరులకు తెలిపారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం



కె.జగన్నాథపురంలో అగ్నిప్రమాదంలో కాలిబూడిదైన ఇల్లు

అయినవిల్లి: మండలంలోని కె.జగన్నాథపురంలో కొత్తపల్లి సూర్యనారాయణకు చెందిన ఇల్లు విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంగళవారం రాత్రి కాలిబూడిదైంది. ఈ ప్రమాదంలో బంగారం, వెండి వస్తువులు, రూ.3 విలువైన నగదు దగ్ధమయ్యాయని సూర్యనారాయణ తెలిపారు. రేషన్‌కార్డు, ఆధార్‌కార్డులు, పిల్లల సర్టిఫికెట్లు అగ్నికి ఆహుతయ్యాయి. ప్రమాదం జరిగిన సమయంలో కుటుంబ సభ్యులు ఎవరూ లేరు. తమను ఆదుకోవాలని సూర్యానారాయణ కోరారు.

అగ్నిప్రమాద బాధితులకు పరామర్శ

అయినవిల్లి: మండలంలోని కె.జగన్నాథపురంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల జరిగిన అగ్నిప్రమాదంలో కొత్తపల్లి సూర్యనారాయణకు చెందిన తాటాకిల్లు కాలిబూడిదైంది. ఈ ప్రమాదంలో సూర్యనారాయణ, ఆయన కుమారుడు శ్రీనులకు చెందిన కుటుంబాలు నిరాశ్రయులయ్యారు. విషయం తెలుసుకుని స్థానిక సర్పంచ్ మేడిశెట్టి ఉషారాణి ఆధ్వర్యంలో అగ్నిప్రమాద బాధితులకు నిత్యావసర సరుకులు, కిరాణా సామగ్రి, దుప్పట్లు, వస్త్రాలు, వంట సామగ్రి గిన్నెలు, కూరగాయలు తక్షణమే ఏర్పాటు చేశారు. ఈ సాయాన్ని జెడ్పీటీసీ సభ్యుడు గన్నవరపు శ్రీనివాసురావు చేతుల మీదుగా పంపిణీ చేశారు.

పేదలకు కార్పొరేట్ వైద్యం అందించేందుకు కృషి



పి.గన్నవరం సీహెచ్‌సీపై నిర్మించిన నూతన భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

పి.గన్నవరం: ప్రజలకు కార్పొరేట్ స్థాయిలో వైద్య సేవలు అందించాలన్న లక్ష్యంతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రూ.వేల కోట్లతో ప్రభుత్వ ఆస్పత్రులను అభివృద్ధి చేస్తున్నారని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. పి.గన్నవరంలో 30 పడకల ప్రభుత్వాస్పత్రిని రూ.3 కోట్లతో 50 పడకల ఆస్పత్రిగా అభివృద్ధి చేశారు. ఇందులో భాగంగా సీహెచ్‌సీపై నిర్మించిన నూతన భవన సముదాయాన్ని ఎమ్మెల్యే చిట్టిబాబు బుధవారం ప్రారంభించారు. మండల పార్టీ అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో చిట్టిబాబు మాట్లాడుతూ ఈ ఆస్పత్రిలో అధునాతన వైద్య పరికరాలతో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుతాయని వివరించారు. ఈ ఆస్పత్రి వల్ల ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని చిట్టిబాబు అన్నారు. ఆయన్ను ఆస్పత్రి వైద్య సిబ్బంది ఘనంగా సత్కరించారు. ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, స్థానిక ఇన్‌చార్జి ఎంపీపీ పాలూరి వీరభద్రం, జెడ్పీటీసీ గన్నవరపు శ్రీనివాస్, తహసీల్దార్ జి.రవీంద్రనాథ్ ఠాగూర్, ఎంపీడీఓ ఎం.భారతి, సర్పంచ్‌లు తోలేటి బంగారునాయుడు, బొండాడ నాగమణి, నూకపెయ్యి ప్రసన్నకుమార్, ఆస్పత్రి సూపరింటెండెంట్ కోటేశ్వరరావు, అడ్డగళ్ల వెంకట సాయిరామ్ తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శంగా సంక్షేమ పథకాల అమలు

ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు



శివకోడులో సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే రాపాక

రాజోలు: సంక్షేమ పథకాలు అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచిందని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. బుధవారం శివకోడులో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం మంజూరు చేసిన సంక్షేమ, అభివృద్ధి పథకాలను వివరించారు. ఎమ్మెల్యే రాపాక మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ఆదర్శవంతంగా నిలిచాయన్నారు. ఎలాంటి వివక్షకు తావు లేకుండా అర్హత ఒక్కటే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు మంజూరు చేస్తున్నారన్నారు. వీటిని సక్రమంగా, పారదర్శకంగా అమలు చేసేందుకు సచివాలయం, వలంటీర్ వ్యవస్థలను తీసుకువచ్చారన్నారు. సర్పంచ్ నక్కా రామారావు, జెడ్పీటీసీ మట్టా శైలజ, రాజోలు సొసైటీ అధ్యక్షుడు కూనపరెడ్డి రాంబాబు, రాజోలు సర్పంచ్ రేవు జ్యోతి, ఎంపీటీసీలు చెల్లింగి లక్ష్మీఈశ్వరి, కొపనాతి పుష్పలత, మాజీ ఏఎంసీ చైర్మన్ గెద్దాడ సత్యనారాయణ, మాజీ ఎంపీపీ పాలపర్తి ధనలక్ష్మి, గుబ్బల మనోహర్, బండారు కాశీ పాల్గొన్నారు.

సురక్షకు విశేష స్పందన



అప్పనపల్లిలో చిన్నారికి అన్నప్రాశన చేస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు



వక్కలంకలో రోగులకు పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది



మొదుకూరు సురక్ష శిబిరంలో సేవలు అందిస్తున్న వైద్యులు

మామిడికుదురు: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష పథకానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు పేర్కొన్నారు. అప్పనపల్లిలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని బుధవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. సామూహిక సీమంతాలతో పాటు చిన్నారులకు అన్నప్రాశన చేశారు. జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా అందిస్తున్న ఉచిత వైద్య సేవల ద్వారా ప్రతి నిత్యం వేలాది మంది ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. గర్భిణులకు, బాలింతలకు, చిన్నారులకు అవసరమైన వైద్య సేవలు అందిస్తున్నారని చిట్టిబాబు పేర్కొన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కశిరెడ్డి అంజిబాబు, సర్పంచ్ గెద్దం మంగాలక్ష్మి, ఎంపీటీసీ బొంతు నీలిమ, పీఏసీఎస్ చైర్మన్ గెద్దం కృష్ణమూర్తి, పీహెచ్‌సీ వైద్యాధికారి కేజే ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

పి.గన్నవరం: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు విజ్ఞప్తి చేశారు. వాడ్రేవుపల్లిలో ఆరోగ్య వైద్య శిబిరాన్ని సర్పంచ్ ప్రత్తిపాటి ఉమా మహేశ్వరి బుధవారం ప్రారంభించారు. శిబిరాన్ని సందర్శించిన ఎమ్మెల్యే చిట్టిబాబు మాట్లాడారు. వైద్య సిబ్బంది 395 మందికి వైద్య సేవలు అందించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సీహెచ్ గంగాభవాని, నాయకులు యల్లమెల్లి శ్రీనివాస్, పితాని సురేష్, యలమర్తి అమరనాథ్, కొంబత్తుల రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అంబాజీపేట: ప్రజల ఆరోగ్య భద్రత అంశాన్ని పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వం తీసుకుందని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకుడు వాసంశెట్టి పెదబాబు అన్నారు. వక్కలంకలో ఇన్‌చార్జి తహసీల్దార్ పి.నాగపద్మలక్ష్మి పర్యవేక్షణలో సర్పంచ్ వాసంశెట్టి రేవతి అధ్యక్షత జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని బుధవారం నిర్వహించారు. వారు మాట్లాడుతూ గ్రామంలో 2236 మంది జనాభా ఉండగా 472 మందికి టోకెన్‌లు అందించామన్నారు. ఈ వైద్య శిబిరంలో 230 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ పిల్లి సత్యవేణి తదితరులు పాల్గొన్నారు.

మలికిపురం: మండలంలోని అడవిపాలెంలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం జరిగింది. సర్పంచ్ కొల్లు అనంతలక్ష్మి పాల్గొని మాట్లాడుతూ సీఎం ప్రవేశపెట్టిన ఆరోగ్య సురక్ష వల్ల సామాన్యులకు ఖరీదైన వైద్యం అందుబాటులో ఉంటుందన్నారు. ఎంపీటీసీ ఆచంట మాణిక్యం, మండల జేసీఎస్ కన్వీనర్ చింతా రాజబాబు, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ నల్లి శివకుమార్, మండల తహసీల్దార్ ఎల్.నరసింహారావు, ఎంపీడీవో ముత్యం వీరాస్వామినాయుడు తదితరులు పాల్గొన్నారు.

రాజోలు: కాట్రేనిపాడులో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని బుధవారం నిర్వహించారు. సర్పంచ్ అడబాల శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన సమావేశం జరిగింది. ఏఎంసీ వైస్ చైర్మన్ సుంకర బాబ్జి మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్ రెడ్డి నిరుపేదల ఆరోగ్యంపై ఎంతో శ్రద్ధ చూపుతున్నారన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. మండల పార్టీ అధ్యక్షుడు కట్టా శ్రీనివాసరావు, సొసైటీ అధ్యక్షుడు అడబాల రాంప్రసాద్, పైడిపర్తి రామారావు, రత్నాజీ, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

ఆలమూరు: రాష్ట్రాన్ని ఆరోగ్యాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్ ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష పథకాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ పెంటపాటి శ్యామల, ఎంపీటీసీ చుండ్రు సునీత, పీఏసీఎస్ అధ్యక్షుడు నల్లి రాజు అన్నారు. మండలంలోని మోదుకూరులో బుధవారం గ్రామ సచివాయ ఆవరణలో తహసీల్దార్ ఐపీ శెట్టి, ఎంపీడీవో కె.జాన్ లింకన్, గ్రామ పంచాయతీ కార్యదర్శి కె.మోక్షాంజలి ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం ఏర్పాటు జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లాలోని వైద్య నిపుణులతో పాటు స్థానిక వైద్యాధికారులు పాల్గొని 348 మందికి మెరుగైన వైద్య సేవలు అందించారు. రోగులకు 105 రకాల మందులను ఉచితంగా అందజేశారు.

ఆత్రేయపురం: మండలంలోని అంకంపాలెంలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఎంపీడీఓ నాతిబుజ్జి, వైద్యాధికారి పి.సౌమ్య, దుర్గాభవాని పర్యవేక్షణలో శిబిరం నిర్వహించారు. వైద్యులు బి.దుర్గాభవానీ, రమాసౌజన్య వైద్యసేవలు అందించారు. శిబిరంలో భాగంగా ఉచితంగా ఈసీజీ, ల్యాబ్ పరీక్షలు నిర్వహించి 157 రకాల మందులను పంపిణీ చేసి 27 మందికి కళ్లజోళ్లు పంపిణీ చేశారు. 447 మందికి వైద్య సేవలు అందించి 66 మందికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

అయినవిల్లి: మండలంలోని పొట్టిలంక సర్పంచ్ కొనే సునీత సుబ్బలక్ష్మి అధ్యక్షతన పొట్టిలంక, కొండుకుదురు గ్రామాలకు కొండుకుదురులో బుధవారం సురక్ష శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అయినవిల్లి జెడ్పీటీసీ గన్నవరపు శ్రీనివాసరావు హాజరయ్యారు. శిబిరంలో 515 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. పార్టీ మండల అధ్యక్షుడు కుడుపూడి విద్యాసాగర్, సర్పంచులు వార జయసావిత్రి, లక్ష్మీనరసింహరామ్, కాశీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

అయినవిల్లి: మండలంలోని మాగాం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. దీనికి సంబంధించి స్థానిక ఎస్సై ఎస్.నాగేశ్వరరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని మాగానికి చెందిన నక్కా వెంకటేశ్వరరావు (34) ఈ నెల 9న ఇంటి వద్ద బాత్‌రూంలో ప్రమాదవశాత్తూ కాలుజారి పడ్డాడు. తలకు బలమైన గాయమైంది. అతన్ని కుటుంబ సభ్యులు అమలాపురం ఏరియా ఆస్పత్రికి అక్కడి నుంచి పరిస్థితి విషమించడంతో కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. దీనిపై మృతుడి సోదరుడి ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య మీనాకుమారి, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

బీజేపీ బలోపేతానికి దిశా నిర్దేశం

కొత్తపేట: గ్రామ స్థాయి నుంచీ బీజేపీ బలోపేతమే లక్ష్యంగా రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేస్తూ ప్రత్యేక ప్రణాళికను రూపొందించారని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలూరి సత్యానందం తెలిపారు. ఇటీవల రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా నియమితులైన పాలూరి మంగళవారం రాత్రి విజయవాడలో పురందేశ్వరిని మర్యాదగా కలసి, శాలువాతో సత్కరించి కృతజ్ఞతలు తెలియజేశారు. ఆయన వెంట ఎం.ఆదినారాయణ ఉన్నారు.

మాదిగల విశ్వరూప పాదయాత్ర పోస్టర్ ఆవిష్కరణ

ఆలమూరు: శీతాకాల పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లును ఆమోదించాలని కోరుతూ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ పిలుపు మేరకు నిర్వహిస్తున్న విశ్వరూప పాదయాత్రను విజయవంతం చేయాలని జిల్లా ఉపాధ్యక్షుడు కొమ్ము నారాయుడు కోరారు. కృష్ణ మాదిగకు మద్దతుగా జిల్లా ఎమ్మార్పీఎస్ చేపట్టనున్న పాదయాత్రకు మాదిగలు, ఉప కులాల నేతలందరూ ఈ విశ్వరూప యాత్రలో పాల్గొని సంఘీభావం ప్రకటించాలని ఆయన సూచించారు. ఆలమూరులో ఈ పోస్టర్‌ను వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సేవాదళ్ సంయుక్త కార్యదర్శి చల్లా ప్రభాకరరావు ఆవిష్కరించారు.